క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత


నగదు అందజేస్తున్న సభ్యులు

దేవరకొండ : పట్టణ కేంద్రానికి చెందిన ఆకనోని గోవింద్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్య ఖర్చుల కోసం హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఆ ఆస్పత్రికి వెళ్లి ఆయన భార్యకు వైద్యఖర్చుల కోసం రూ.16వేలను ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో రేవత్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, లింగారెడ్డి, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చందంపేట : నేరెడుగొమ్ము మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొర్ర శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలలో ప్రతి గ్రూప్‌లో 40సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 5నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం ఎంపికైన వారి వివరాలను ఈనెల 26న కాలేజీ నోటీసు బోర్డులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

- 47 లీటర్ల సారాయి సీజ్


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కొండమల్లేపల్లి : ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నల్లగొండ, డీటీఎఫ్ నల్లగొండ, దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల పరిధిలోని మేగ్యతండా, అంబోతుతండా, బండమీదితండా, పన్నితండాల్లో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతోపాటు 47లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సారాయి తయారు చేసినా విక్రయించినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


డ్యాన్స్ క్లాస్‌ను ప్రారంభిస్తున్న ఎన్‌వీటీ

దేవరకొండ : వేసవిలో ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ కోరారు.శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ క్లాస్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవులను వృథా చేయకుండా చిన్నారులు ఈశిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ శిబిరంలో వివిధ రకాల నృత్యాలను శిక్షకులు నేర్పిస్తారని తద్వార చిన్నారుల్లో ఆసక్తి పెంపొందుతుందని తెలిపారు. క్రీడాకారులు, కళాకారులకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో శేఖర్, క్రాంతి, రాము, శ్రీధర్ గౌడ్, భాస్కర్‌రెడ్డి, ఖాజా, నరసింహ, భాస్కర్, చైతన్య, తదితరులున్నారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

కేతేపల్లి: రాబోయే పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు 5శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో ఆయన పర్యటించి సమస్యలపై దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను రూ.4వేల నుంచి రూ.6వేల వరకు పెంచాలని కోరారు. అదేవిధంగా దివ్యాంగులకు వైకల్యం శాతంతో సంబంధం లేకుండా ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజయ్య, పాల్వాయి సందీప్, ముక్కాముల సిరి, నర్సింగ్ సుప్రియ, వెంకటసాయి, పాల్గొన్నారు.

పచ్చని తోరణంలా రహదారులు

పెద్దవూర : మండలంలోని గ్రామీణ రోడ్లు హరిత తోరణాన్ని పర్చుకుని కనువిందు చేస్తున్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి గ్రామీణ రహదారుల వెంట మొక్కలను నాటారు. మండలంలోని పోతునూరు-పులిచర్ల, పెద్దవూర-గర్నెకుంట, ముసలమ్మచెట్టు-గుర్రంపోడ్ తదితర గ్రామీణ రహదారుల వెంట ఐదేళ్ల క్రితం మొక్కలను నాటారు. మండుటెండలకు సైతం ఈ రోడ్లపై వెళ్లేటప్పుడు ఎండకూడా తాకడం లేదు. దీంతో ఈ రోడ్లపై వెళ్లే వాహనదారులు చెట్లకింద కొద్దిసేపు తమ వాహనాలను ఆపుకుని సేదదీరుతూ ఎండ వేడిమికి ఉపశమనం పొందుతున్నారు.


పోతునూరు-పులిచర్ల రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు


గర్నెకుంట-పెద్దవూర రహదారిలో..

'ఇంటిగ్రేటెడ్' పూర్తయ్యేదెన్నడో!

- నిలిచిన మార్కెట్ నిర్మాణం
- మున్సిపాలిటీలో రూ. 2 కోట్ల వ్యయంతో పనులు
- రెండేళ్లు గడుస్తున్నా ఇంకా స్లాబ్ దశలోనే..


పనులు నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

హాలియా : రోజురోజుకూ విస్తరిస్తున్న హాలియా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు అధిగమించడంతో పాటు అన్ని రకాల వెజ్, నాన్ వెజ్ విక్రయాలు ఒకే చోట ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. హాలియా మున్సిపాలిటీలో గత ప్రభుత్వం రూ. 2 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. హాలియా పట్టణంలోని ఎడమ కాల్వ సమీపంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు 2022లో ప్రారంభమయ్యాయి. అయితే ఈ పనులు ఆది నుంచి నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో కొన్ని నెలలుగా పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం రూ. కోటి 70లక్షలతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ వరకు పూర్తయి. ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ వరకు పూర్తయి రెండేళ్ల గడుస్తున్నా నేటికి నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు.

ఇంటిగ్రేటెడ్‌లో చేపట్టే పనులు ..

పట్టణంలోని రెండెకరాల స్థలంలో ఆధునిక హంగులతో నిర్మించే ఈ మార్కెట్‌లో కూరగాయల (వెజిటేరియన్)కు 26 దుకాణాలు, 8పూల దుకాణాలు, మటన్, చికెన్, చేపల(నాన్‌వెజ్)కు 14 దుకాణాల చొప్పున కేటాయించనున్నారు. వ్యాపారులు నష్టపోవద్దనే ప్రధాన ఉద్దేశంతో ఈ దుకాణాల సముదాయంలో వెజ్, నాన్‌వెజ్‌కు వేర్వేరుగా సదుపాయాన్ని కల్పించనున్నారు. అదే విధంగా మార్కెట్ వచ్చే వినియోగదారులకు మంచినీటి వసతితో పాటు పార్కింగ్ స్థలాన్ని సైతం అందుబాటులో ఉండనుంది. మార్కెట్‌కు వచ్చే వినియోగదారుడికి కూరగాయలు, మాంసం, చేపలు ఒకేచోట దొరకనున్నాయి. వాటి ధరల కోసం డిజిటల్ బోర్డులు అమర్చనున్నారు. దీనితో వినియోగదారుడికి సమయం ఆదాతో పాటు తాజా సరుకులు లభించేలా ఏర్పాట్లు చేయనున్నారు. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నారు.

ప్రజలకు ప్రయోజనకరం..

హాలియా పట్టణంతో పాటు తిరుమలగిరి(సాగర్), పెద్దవూర, నిడమనూరు మండలాల నుంచి నిత్యం హాలియాకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులకు ఈ మార్కెట్ ఎంతో ఉపయోగపడనుంది. కూరగాయల వ్యాపారులు, మాంసం వ్యాపారులు హోల్‌సేల్‌గా విక్రయించడంతో పాటు రిటేల్‌గా అమ్ముకునే సౌకర్యం కలగనుంది. వినియోగదారుడికి లాభం చేకూరడంతో పాటు వ్యాపారులకు సైతం సౌకర్యవంతంగా మారుతుంది.

పనులు పూర్తి చేసేందుకు కృషి

హాలియాలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రస్తుతం ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. చేసిన పనులకు బిల్లు పెట్టాం. ప్రభుత్వం నుంచి ఆ నిధులు విడుదల కాగానే మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా వెంటనే చర్యలు తీసుకుంటాం.

– సురేష్, పబ్లిక్ హెల్త్ ఏఈ

ప్రతి గీత కార్మికుడికి కాటమయ్య కిట్టు

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


గీత కార్మికులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : ప్రతీ గీత కార్మికుడికి కాటమయ్య కిట్ల (సేఫ్టీకిట్)ను అందిస్తామని సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. బీసీ కార్పొరేషన్ నల్లగొండ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన గీత కార్మికులకు సేఫ్టీకిట్లు అందజేసి మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అందించే సేఫ్టీకిట్లు కార్మికులకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కాటమయ్య రక్ష కిట్ల ద్వారా గీత కార్మికులకు పూర్తి రక్షణ ఉంటుందన్నారు. గీత కార్మికులు తాటి చెట్టు ఎక్కి కల్లుగీసే సమయంలో ప్రమాదవశాత్తు మోకులు తెగి ప్రమాదాల బారిన పడేవారని, వీరిలో కొందరు శాశ్వత అంగ వైకల్యంతో పాటు మరి కొందరు ప్రాణాలు సైతం కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో గీత కార్మికుడు తాటిచెట్టు నుంచి పడి చనిపోయారని మాట వినపడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం గీత కార్మికులందరికీ సేఫ్టీకిట్లు అందిస్తుందని తెలిపారు. ప్రమాదాలకు గురైన సమయంలో గీత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు పూర్తిగా ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు యడవెల్లి వల్లబ్‌రెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ గౌడ్, బాస్కర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, అంజనేయులు, నకిరేకంటి సైదులు మాదిగ, ఎక్సైజ్ సీఐ కల్పన ఎక్సైజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏపీ పోలీసుల దౌర్జన్యంపై జర్నలిస్టుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

మిర్యాలగూడ టౌన్ : సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై ఏపీ పోలీసుల దాడిని ఖండిస్తూ శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బైక్ ర్యాలీతో వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ సాక్షి పై అక్రమ కేసులను పెట్టి పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని, రెడ్‌బుక్ పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే విధంగా ఏపీ ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారిధిగా పని చేసేది జర్నలిస్టులు మాత్రమేనన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఖాజాహాఫీజుద్దీన్, నామిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఖాజా నాజీముద్దీన్, అస్లాం, అయ్యూబ్, రంగా శ్రీనివాస్, రంగ శ్రీనివాస్, బొంగరాల మట్టయ్య, బాలాజీరావు, భాస్కర్, జంగా లక్ష్మణ్ యాదవ్, రామకృష్ణ, పుప్పాల యాదగిరి, రాచకొండ రమేష్, కాతోజు నాగాచారి, రాజారాం, హరీష్, సునిల్, బంటు శేఖర్, కట్ల భాబురావు, కందుల వెంకటేశ్వర్లు, జెర్రిపోతుల పార్థు, కట్ట బాబురావు, సునిల్, అశోక్, పేర్ల వెంకన్న, వెంకన్న, అశోక్, శివకృష్ణ, మాణిక్యం, ధైద రవి, మంద సైదులు, సీపీఐఎం నేత కాశీ, సీపీఎం నేత అంజాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో గల ఆయన నివాసంలో ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకుల బాలికల కళాశాలకు చెందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కళ్యాణి, లచ్చిరాంనాయక్, పాపానాయక్, కొర్ర రాంసింగ్, సీత్యానాయక్, నాగేశ్వరరావు, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే స్వాగతం

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని గుడితండాకు చెందిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబనాయక్ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీంద్రకుమార్

దివ్యాంగురాలికి వీల్ చైర్ బహూకరణ


వీల్ చైర్‌ను అందిస్తున్న అనిల్‌కుమార్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని గట్టుమీదితండాకు చెందిన దివ్యాంగురాలు ఆంగోతు సుశీలకు ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ తన సొంత ఖర్చులతో వీల్‌చైర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన ఆంగోతు సుశీలకు రెండు కాళ్లు సహకరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందన్నారు. దీంతో సుశీలకు వీల్ చైర్‌ను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్‌నాయక్, హరినాయక్, తిమ్మాపురం మాజీ ఉప సర్పంచ్ తుమ్మరగోటి రమేష్, సాయి, చందు, సేవా, ఏఈ నరేష్‌నాయక్, మన్నెం కోటి, రావుల రాము, శివ, గంగుల అంజి, శేఖర్‌గౌడ్, శివ పాల్గొన్నారు.

బేస్‌మెంట్ లెవల్‌కే పరిమితం!


బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం

- నిలిచిన ప్రాథమిక పాఠశాల భవనం పనులు
- బిల్లుల రాక మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- నిధులు విడుదల చేయాలని కోరుతున్న గ్రామస్తులు

మాడుగులపల్లి : మండలంలోని కుక్కడం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం బేస్‌మెంట్ లెవల్‌కే పరిమితమైంది. మండల కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం 2023 జూలై నెలలో అప్పటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నిధులు రూ.23లక్షల వ్యయంతో రెండు గదుల ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ బేస్‌మెంట్ వరకు పూర్తి చేయగా పనులు మొదలు పెట్టిన నాటి నుంచి తమకు ఒక్క బిల్లులు అందని భవన నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. పాఠశాల భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణానికి వ్యయం పెరిగిందని ఇప్పటివరకు తనకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణ పనులను నిలిపివేసినట్లు కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేసి భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం

10 నెలల క్రితం ఎమ్మెల్సీ నిధుల కింద బిల్లులు పంపించాం. ప్రభుత్వం బిల్లులకు అమౌంట్ పంపలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు మొదలు పెట్టి పూర్తి చేస్తాం.

– జగన్, స్కూల్ హౌసింగ్ ఏఈ

విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలి


చింతపల్లి : మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలక్ష్మి

చింతపల్లి : విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని దేవరకొండ ఏడీ ఏ శ్రీలక్ష్మి డీలర్లకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలో అన్ని గ్రామాల్లోని ఎరువుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల దుకాణాల యాజమాన్యం ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారుల రికార్డులో ప్రతి రోజు విక్రయించిన అమ్మక వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎరువులు విక్రయించే రైతులకు తప్పనిసరిగా రశీదులను అందించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించిన ఎమ్మార్పీ ధరల కన్నా ఎక్కువ తీసుకున్న రైతులు తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి, దేవరకొండ వ్యవసాయ అధికారి రవికుమార్, ఏఈవోలు మౌనిక,ప్రియాంక పాల్గొన్నారు.

లైసెన్స్ షాపుల్లోనే విత్తనాలు కొనాలి

అడవిదేవుపల్లి : మండల రైతులు వానా కాలంలో విత్తనాలు లైసెన్స్ కలిగిన షాపుల్లోనే కొనాలని మండల వ్యవసాయ శాఖ అధికారి గుర్రం సరిత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని విత్తన కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం విత్తనాలకు సంబంధించిన వివిధ రకాల రికార్డులు, స్టాక్‌లను పరిశీలించి మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో లైసెన్స్‌లు కలిగిన షాపుల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా విత్తనాలు అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా రశీదును తీసుకోవాలన్నారు. విత్తనాలను ప్రభుత్వ నిబంధనల మేరకే అమ్మాలన్నారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులున్నారు.

అనాథలకు ఇల్లు కట్టించిన యువకులు

గట్టుప్పల్ : వైకల్యానికితోడు మానసిక పరిస్థితి బాగాలేని అనాథలకు ఆ గ్రామంలోని పద్మశాలి యువకులు అండగా నిలిచారు. వారికి ఇల్లు నిర్మించి ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. వివరాలు.. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన చిలుకూరి వెంకయ్య-పుల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు అంజయ్య, సత్తయ్య. వీరికి వైకల్యంతోపాటు మానసిక స్థితి బాగోలేదు. ఇద్దరు కుమారులు చిన్నగా ఉండగానే తండ్రి వెంకయ్య మృతి చెందాడు. తల్లి చేనేత పనులు చేస్తూ కొంతకాలం కుటుంబ పోషణ చేసింది. 8 నెలల క్రితం తల్లి కూడా అనారోగ్యంతో ప్రాణాలు వదిలింది. ఇద్దరు కుమారులకు ఇల్లు లేదు... అన్నం పెట్టేవారు లేకుండా పోయారు. దీంతో ఆ అనాథల కోసం మండల కేంద్రానికి చెందిన పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిశోర్ నేత ఆధ్వర్యంలో సంఘం సభ్యులు రెండు గదుల రేకుల ఇంటిని నిర్మించారు. ఆ గృహాన్ని మాజీ జెడ్పీటీసీ వెంకటేశం శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నామని జగన్నాథం, గోపాల్, సంఘం అధ్యక్షుడు పున్న కిశోర్, పున్న ఆనంద్, బుచ్చయ్య, పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమ్య

హాలియా : సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ పాలిటెక్నిక్ కంపాసాగర్ శాస్త్రవేత్తలు శ్రీ రమ్య, స్వాతి అలన్నారు. శుక్రవారం అనుముల మండలంలోని నాయుడుపాలెంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. సేంద్రియ వ్యవసాయం, సాగునీటి ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరిత, వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్, మాజీ ఎంపీటీసీ సర్దార్, చిరంజీవి, మాజీ ఉప సర్పంచ్ మోతీలాల్, లక్ష్మణ్ నాయక్, మల్లికార్జున్ , అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి


డిండి : ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

హాలియా : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మినారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం హాలియాలో నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు అన్వరుద్దీన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు, ఎస్‌కె బషీర్, చాంద్ బాషా, వెంకటేశ్వర్లు, అంజనేయులు, ఎస్‌కె సైయ్యద్ హుస్సేన్, యూసుఫ్ ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

డిండి : దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సదానందానికి సమ్మె నోటీసును కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జవహర్‌లాల్, పరమేష్, అంజి, భారతి, సుజాత, చెన్నమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం అందించాలి

నిడమనూరు : ఉపాధి కూలీలకు కనీస వేతనం అందించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బొకమంతలపహాడ్ గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన కూలి రూ.300 లు అమలుకావడంలేదని, కొలతల ప్రకారం కూలీలకు రోజుకు రూ.100లు పడటం లేదని వాపోయారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ, వైద్య సేవల కిట్ ఉండాలన్నారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు తగ్గకుండా, పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు మల్లికంటి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మికులు రవీందర్ రెడ్డి, నాగమ్మ, సైదయ్య, జానయ్య, బ్రహ్మానందరెడ్డి, నాగరాజు, వీరయ్య, సుదాకర్, నాగమణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.